క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పుర్మాణి సాంబారెడ్డి తండ్రి రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్‌గా బాబు



సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు జక్కుల బాబు ముదిరాజ్ సంఘం జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన ఎన్నికల్లో చిగురుమామిడి మండలం నుంచి తొలిసారి ఆయన డైరెక్టర్‌గా ఎన్నికవడంతో మండలంలోని పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు పెసరి రాజేశం, ఇందుర్తి గ్రామ మాజీ అధ్యక్షుడు కూనచ్చుల మహేందర్ కోరారు.

రైతు భరోసా పథకం అమలు చేయాలి

గన్నేరువరం: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా పంట పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. పథకం అమలుకు ఎలాంటి షరతులు విధించొద్దని, రైతుబంధు పొందిన ప్రతీ ఒక్కరికి రూ.7,500 ఇవ్వాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం



రామడుగు: మండలంలోని పందికుంటపల్లి గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రాక్ష మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తుల్ల అజయ్, ఉపాధ్యక్షుడిగా కట్కం రమేశ్, జాయింట్ సెక్రటరీగా పురంశెట్టి రాజమల్లు, కోశాధికారిగా పురంశెట్టి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

గొర్రెల పెంపకందారుల నూతన కమిటీ ఎన్నిక



రామడుగు: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామ గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎగుర్ల ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా గుంటి రాజు, డైరెక్టర్లుగా ఏగుర్ల ఎల్లయ్య, కడారి అశోక్‌కుమార్, కడారి రాజయ్య, ఎగుర్ల వసంత, బైరి లచ్చయ్య ఎన్నికయ్యారు.

నానో డీఏపీపై రైతులకు అవగాహన



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో శనివారం ఇఫ్‌కో కంపెనీ యాజమాన్యం, అధికారులు మెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించారు. ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులను వాడకుండా నానో ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ సంజీవరెడ్డి, మేనేజర్ బాలాజీ, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలకు ప్రోత్సాహకం

- నాటుకుంటే కొనుగోలు, ఎరువులు, నిర్వహణ ఖర్చు ఇవ్వనున్న ప్రభుత్వం
- 'ఉపాధిహామీ' ద్వారా చెల్లింపు
- ఇతర మొక్కలూ కలిపి 86 వేలు నాటడం టార్గెట్
- మానకొండూర్ మండలంలో 27 నర్సరీలు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

మానకొండూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతుల భూముల్లో మొక్కలు నాటించి, వారి ఆర్థిక ఎదుగుదలకు సహకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గతంలో పంట పొలాల గట్లపై టేకు మొక్కలు నాటించి, ఆదుకుంది. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పండ్ల మొక్కలు నాటించడంతోపాటు వాటికి ప్రోత్సాహకం అందించాలని నిర్ణయించింది.

నర్సరీల్లో అందుబాటులో మొక్కలు

మరోవైపు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మానకొండూర్ మండలంలోని 27 గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద 27 నర్సరీలు ఉన్నాయి. వీటిల్లో గుల్మోర్, వేప, చింత, ఉసిరి, అల్లనేరేడు, జామ, పాతోలియా, షిగో, నిమ్మ తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని నాటేందుకు స్థలాలను గుర్తించి, గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని ఆదేశించామన్నారు.

వీటికి ప్రోత్సాహకం..

ఆర్థికంగా ఎదిగేందుకు పంట పొలాల్లో కొబ్బరి, మామిడి, బత్తాయి, మునగ, నిమ్మ, ఆయిల్‌పాం వంటి మొక్కలు నాటుకోవాలని ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. వీటిలో మునగ తప్ప మిగతా మొక్కలు ప్రైవేటు నర్సరీల్లో కొనుగోలు చేస్తే ఉపాధిహామీ పథకం కింద కూలీలతో గుంతలు తవ్వించి, నాటిస్తామని చెబుతున్నారు. మొక్క కొనుగోలు, నీరందించడం, ఎరువుల నిర్వహణ ఖర్చుల్లో కొంత మొత్తాన్ని చెల్లించనున్నట్లు పేర్కొంటున్నారు. మూడేళ్లకు గానూ ఆరుసార్లు ఒక్కో మొక్కకు రూ.25 చొప్పున ఎరువులకు ఇస్తామని అంటున్నారు. చిన్న, సన్నకారు రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. గ్రామానికి 3 వేల చొప్పున 86 వేల మొక్కల(ప్రభుత్వ, ప్రైవేటు నర్సరీలవి)ను నాటాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు.

మొక్కలు కొనుగోలు చేస్తే చెల్లింపులు ఇలా..

మొక్క	చెల్లింపులు ఒక్కోదానికి (రూ.లో)	ప్రతినెలా నిర్వహణకు ఒక్కోదానికి (రూ.లో)	మొక్కల సంఖ్య (ఎకరానికి)
కొబ్బరి	36	12	40
మామిడి	30	25	70
బత్తాయి	25	25	110
ఆయిల్‌పాం	20	12	57
నిమ్మ	20	12	110
మునగ	-	-	110

రైతులు ఆసక్తి చూపుతున్నారు..

గ్రామాల్లోని నర్సరీల్లో అనేక రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిని నాటడమే కాకుండా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పండ్ల మొక్కలూ పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. మానకొండూర్ మండలానికి 50 ఎకరాల వరకు పండ్ల మొక్కలు నాటాలని టార్గెట్ ఉంది. ఇప్పటికే 58 ఎకరాల్లో నాటుకునేందుకు రైతులు ముందుకువచ్చారు. డాక్యుమెంటేషన్ చేయాల్సి ఉంది. చాలామంది పండ్ల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. వీటికి మెయింటెనెన్స్ కూడా ఇస్తాం. – నర్సయ్య, ఎంపీడీవో

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన నాయకులు





కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న తిరుపతిరెడ్డి, హరీశ్

ఇల్లందకుంట: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు.

జమ్మికుంట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో శనివారం మడిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎగ్గెటి హరీశ్ కలిశారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్.. రైతులకు వరం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

జమ్మికుంట: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన.. రైతులకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని కేవీకేలో నిర్వహించనున్న వర్చువల్ ప్రోగ్రాం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 18న వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్న కిసాన్ సమ్మేళన్ ప్రోగ్రాంను దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వర్చువల్‌గా వీక్షించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కేవీకేలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర జల, రైల్వే శాఖల సహాయ మంత్రి వి.సోమన్న హాజరవుతారని పేర్కొన్నారు. 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధి యోజన నిధులు విడుదలయ్యాయని అన్నారు. దేశంలోని రైతులు పంటల పెట్టుబడి కోసం ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. వర్చువల్ ప్రోగ్రాంకు రైతులందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్, అనిల్, ప్రశాంతి, బీజేపీ నాయకులు శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, మాడుల సమ్మిరెడ్డి, సంపెల్లి సంపత్‌రావు, పల్లపు రవి, దొంతల రాజకుమార్, పరిపెల్లి కొండల్‌రెడ్డి, కైలాసకోటి గణేశ్, మోతె స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న కిట్స్ కళాశాల డైరెక్టర్ శంకర్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు కొత్త సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను నేర్చుకోవడంపై దృష్టిపెట్టాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కె.శంకర్ అన్నారు. శనివారం హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లోని కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు వస్తున్నాయని, పరిస్థితులు మారుతున్న దృష్ట్యా తప్పనిసరిగా విద్యార్థులు ప్రతీరోజు సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలను సాధన చేయాలన్నారు. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి శశికళ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, డీన్ ఎం.సతీశ్‌కుమార్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, డీన్ యోగేశ్ పుండలిక్, అకాడమిక్ కో–ఆర్డినేటర్ మల్లయ్య, అధ్యాపకులున్నారు.

చికిత్స పొందుతూ బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



కనకయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కత్తెరపాక కనకయ్య(45) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కనకయ్యకు 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దీంతోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని, వరి, పత్తి పంటలు సాగు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై, గత నెల 30న పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందాక ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటికి తీసుకువచ్చారు. తర్వాత అనారోగ్యానికి గురవడంతో తొలుత కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య మణెమ్మ, ఒక కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే శనివారం వెళ్లి, పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే, వెదిరలో కానిస్టేబుల్ పుర్మాణి సాంబారెడ్డి తండ్రి రాజిరెడ్డి 5 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు వంచ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

డిప్యూటీ సీఎం 'భట్టి' జన్మదిన వేడుకలు



అనాథాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను శనివారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి స్పందన అనాథాశ్రమంలో నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు గూడెపు సారంగపాణి, సుంకరి రమేశ్, ఎండీ.రంజాన్, యాట్ల అశోక్, దొడ్డె నవీన్, సతీశ్ రెడ్డి, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్: నియోజకవర్గంలోని 5 మండలాల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గస్థాయి విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. గత విద్యాసంవత్సరం పదోతరగతిలో 93 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఈసారి వందశాతం విద్యార్థులు పాసయ్యేలా చూడాలని పేర్కొన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థుల మొదటి నుంచి చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, ఎంపీపీ ఇరుమళ్ల రాణి, జెడ్పీటీసీ సభ్యుడు పడిదం బక్కారెడ్డి, ఎంఈవోలు కేతరి వెంకటనర్సింహారెడ్డి, వీడపు శ్రీనివాస్, రామ్‌కిషన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోండి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, నోట్ బుక్స్ కొనుగోలు చేసేందుకు ఒత్తిడి తెస్తున్నారని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు వీడపు అనురాగ్ ఆరోపించారు. విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డికి వినతిపత్రం అందించారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకుల వినతి


విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో హుజూరాబాద్ పట్టణంలోని గుర్తింపు లేని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డికి వినతిపత్రం అందించారు. అడ్మిషన్ పేరిట అడ్డగోలు ఫీజులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



చొప్పదండి: విద్యార్థుల్లో, చిన్నారుల్లో నులిపురుగులను నివారిద్దామని ఎంపీపీ చిలుక రవీందర్, వైద్యాధికారి శైలేంద్ర పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించే నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం చొప్పదండి మండల పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన సమావేశం నిర్వహించారు. 20, 27వ తేదీల్లో విద్యార్థులకు అన్నం తిన్న తర్వాత 20 నిమిషాలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎస్‌హెచ్‌వో ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగురాళ్ల విక్రయం అడ్డగింత



చొప్పదండి: రాగంపేటలో రంగురాళ్లు, ఉంగరాలు విక్రయిస్తున్న వ్యక్తిని అడ్డుకున్నట్లు ఎంపీటీసీల ఫోరం చొప్పదండి మండల కన్వీనర్ సింగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన వ్యక్తి శనివారం కారులో రాగంపేటకు వచ్చాడన్నారు. స్థానికంగా రంగురాళ్లు, ఉంగరాలు విక్రయిస్తుండగా అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని, ప్రార్థనలు, ఉంగరాలు, రంగురాళ్ల పేరిట మోసం చేస్తే సహించబోమన్నారు. పోలీస్ కమిషనర్ స్పందించి, రంగురాళ్లు అమ్మే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు.

ఆలయంలో చోరీ

తిమ్మాపూర్: నర్సింగాపూర్ ఆదిపెరుమాండ్లు, హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆలయ కమిటీ చైర్మన్ తోట మధుకు హుండీ కనిపించలేదు. దీంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆలయానికి చేరుకొని, పరిశీలించారు. చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



అభినవేశ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కడారి అభినవేశ్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్ తెలిపారు. అతను నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ప్రతిభ కనబరిచాడన్నారు. ఏటా రూ.12 వేల చొప్పున అయిదేళ్లపాటు స్కాలర్‌షిప్ పొందుతాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడితోపాటు కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, టీచర్లు శనివారం అభినందించారు.

భూ విస్తీర్ణం నమోదు చేసుకొని, రిజిస్ట్రేషన్

- కేసు నమోదు

శంకరపట్నం: స్థిరాస్తి ధ్రువపత్రంలో పంచాయతీ కార్యదర్శి విస్తీర్ణం వివరాలు నమోదు చేయకున్నా చేసి, భూమిని కొడుకు పేరిట రిజిస్ట్రేషన్ చేయించిన మొలంగూర్‌కు చెందిన నేరెళ్ల ఆగమ్మపై కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆగమ్మ ఇంటి స్థిరాస్తి ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేయగా పంచాయతీ కార్యదర్శి మమత జారీ చేశారు. కానీ, అందులో విస్తీర్ణం ఎంతనేది నమోదు చేయలేదు. అయితే, ఆగమ్మ తడిగొప్పుల రాజమ్మ భూమి 420 చదరపు గజాలని నమోదు చేసి, తన కుమారుడు సంతోష్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి శనివారం ఫిర్యాదు చేయగా ఆమెపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొత్త రైతులకు పంట రుణాలివ్వాలి

సైదాపూర్: వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైనందున కొత్త రైతులకు పంట రుణాలివ్వాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సైదాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదని, పెట్టుబడి మీదపడిందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ఏడాది రెండుసార్లు విత్తనాలు వేసినా పంట వస్తుందన్న నమ్మకం లేదన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



బియ్యం అందిస్తున్న అనిల్‌గౌడ్, నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుధగోని మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని పార్టీ సీనియర్ నాయకుడు, మన్నెంపల్లి మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ శనివారం పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం 50 కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు నార్ల అశోక్, సుధగోని శ్రవణ్, మార్క సారయ్య, సుధగోని వెంకటరమణ, ఖమ్మం వెంకన్న, జంగా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని 'కప్పతల్లి'



జమ్మికుంట: అగ్రికల్చర్ ప్రైవేట్ ఉద్యోగులు శనివారం జమ్మికుంట పట్టణంలో కప్పతల్లి ఆట ఆడారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ప్రైవేట్ ఎంప్లాయీస్ యూనియన్ జమ్మికుంట మండల అధ్యక్షుడు అంబాల రజనీకాంత్ మాట్లాడారు. వానాకాలం ప్రారంభమైనా ఈ ప్రాంతంలో వర్షాలు పడటం లేదన్నారు. రైతులు పత్తి విత్తనాలు విత్తుకొని, వానల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. అవి మొలకెత్తకపోతే అన్నదాతలు నష్టపోతారన్నారు. అందుకే వారు క్షేమంగా ఉండాలని, వరుణ దేవుడు కరుణించి, వర్షాలు కురవాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మురళి, యాదగిరి, సంపత్, దొడ్డి రాజు, చిరంజీవి, శ్రీనివాస్, సురేశ్, రాజ్‌కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.